క్లుప్తంగా

వెంకటరెడ్డి ఆశయాలు కొనసాగించాలి

హుజూర్‌నగర్ : సీపీఎం నాయకుడు పి.వెంకటరెడ్డి ఆశయాలు కొనసాగించాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పాండు అన్నారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో వెంకటరెడ్డి ప్రథమ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పి.లక్ష్మి, పి.వెంకటరెడ్డి, బ్రహ్మం, సైదులు, హుస్సేన్, శ్రీను, వెంకట్‌నారాయణ, యోనా, వెంకటేశ్వర్లు, వీరమల్లు, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

బియ్యం అందజేత


బియ్యం అందజేస్తున్న దాత కుంట సైదులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని గోపాలపురంలో గల శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో వచ్చే నెల 1న నిర్వహించున్న హనుమాన్ జయంతిని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా నిర్వహించే అన్నదాన కార్యక్రమానికి హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన కుంట సైదులు రూ.7 వేల 500 విలువ గల 125కేజీల బియ్యాన్ని ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

వాటర్‌ట్యాంకర్ బహూకరణ



పంచాయతీ అధికారులకు వాటర్ ట్యాంకర్‌ను అందజేస్తున్న పరిశ్రమ ప్రతినిధులు

మఠంపల్లి : మండలంలోని రఘునాథపాలెం గ్రామానికి మంచినీటి అవసరాలు తీర్చేందుకు గాను స్థానిక సాగర్‌సిమెంట్స్ పరిశ్రమ యాజమాన్యం ఆదివారం సుమారు రూ.1లక్ష విలువ గల 5వేల లీటర్ల కెపాసిటీ గల వాటర్ ట్యాంకర్‌ను పరిశ్రమ అధికారి హరిదాసు ద్వారా గ్రామస్తులు, పంచాయతీ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా పరిశ్రమ ప్రతినిధి హరిదాసు మాట్లాడారు. గ్రామంలో మంచినీటి ఎద్దడి నివారణకు సహకరించాలని గ్రామపెద్దల కోరిక మేరకు యాజమాన్యం వాటర్‌ట్యాంకర్‌ను బహూకరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, పంచాయతీ అధికారులు పరిశ్రమ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు మహ్మద్‌జమీల్, బొబ్బా రవీందర్ రెడ్డి, పందిరి పుల్లారెడ్డి, చింతల వెంకటనారాయణ, మాఘం నరసింహారావు, కిషన్ నాయక్, పెద్దారపు పున్నయ్య, దేవపంగు అచ్చయ్య, నాగుల్‌మీరా, వల్లపుదాసు కొండల్ గౌడ్, జూనియర్ అసిస్టెంట్ మట్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి

నేరేడుచర్ల : ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 2024-2025విద్యా సంవత్సరం త్వరలో ప్రారంభంకానున్న నేపథ్యంలోరాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లు, నీటి సౌకర్యాన్ని కల్పించాలని కోరారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు కూడా అందుబాటులో ఉంచాలన్నారు.

ఆర్థికసాయం అందజేత


ఆర్థికసాయం అందజేస్తున్న ఉపేందర్

హుజూర్‌నగర్ : పట్టణంలోని రామస్వామి గుట్ట వద్ద మోడల్‌కాలనీలో నీటి బకెట్‌లో పడి ఇటీవల మృతి చెందిన చిన్నారి తండ్రి సంతోష్‌సింగ్‌కు ఆదివారం స్థానిక మల్లన్ననగర్‌కు చెందిన కోడి ఉపేందర్ రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

బెల్లి లలితకు ఘన నివాళి


నివాళులర్పిస్తున్న ఎంఎస్ఎఫ్ నాయకులు

నడిగూడెం : తెలంగాణ మలిదశ ఉద్యమకారిణి బెల్లి లలిత 25వ వర్ధంతిని ఆదివారం మండల కేంద్రంలో ఎంఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కన్వీనర్ పందిటి నవీన్‌కుమార్, నాయకులు సమృత్, సతీష్, రాహుల్, రోహిత్, నికిత్, యశ్వంత్, వీరబాబు, నిఖిల్, పాల్గొన్నారు.

క్రీడా నైపుణ్యం పెంచేందుకే..

- కోదాడలో ఉచిత వాలీబాల్ శిక్షణ
- సమ్మర్ క్యాంపునకు హాజరయ్యేందుకు ఆసక్తి కనబరుస్తున్న విద్యార్థులు


వాలీబాల్ ఆడుతున్న విద్యార్థులు

కోదాడరూరల్ : ప్రస్తుతం తల్లిదండ్రులు తమ పిల్లలను చదువులకే పరిమితం చేస్తున్నారు. అయితే వేసవికాలంలో సెలవులను సద్వినియోగం చేసుకునేందుకు, విద్యార్థులు కేవలం చదువులకే పరిమితం చేయకుండా క్రీడల్లో రాణించేందుకు తల్లిదండ్రులు ప్రోత్సహిస్తున్నారు. చదువులతో పాటు ఇతర రంగాల్లో రాణించినప్పుడే విద్యార్థులు చురుగ్గా ఉంటారు. ఈ క్రమంలో కోదాడ పట్టణంలోని బాయ్స్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఉచిత వాలీబాల్ శిక్షణ సమ్మర్ క్యాంపుకు హాజరయ్యేందుకు విద్యార్థులు ఆసక్తి కనబరుస్తున్నారు. ఉదయం ఆరు గంటల నుంచి ఎనిమిది గంటల వరకు కోచ్‌లు ఉచిత శిక్షణను అందజేస్తున్నారు.

ఆసక్తి కనబరుస్తున్న విద్యార్థులు..

పట్టణంలో సమ్మర్ క్యాంపులో భాగంగా ఏర్పాటు చేసిన వాలీబాల్ క్రీడల్లో శిక్షణ పొందేందుకు విద్యార్థులు ఎంతో శ్రద్ధ చూపిస్తున్నారు. పాఠశాల, కళాశాలలకు సెలవులు కావడంతో పిల్లలు ఇంటి వద్ద అల్లరి చేయకుండా, ఫోన్లకే పరిమితం కాకుండా ఉంటారనే ఆలోచనతో తల్లిదండ్రులు కూడా ఈ వాలీబాల్ శిక్షణ ఇప్పించేందుకు ముందడుగు వేస్తున్నారు. కోచ్‌లు వాలీబాల్‌లో అత్యంత ఆసక్తి కనబరుస్తున్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి వారిని జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఆడించేందుకు వారితో స్త్రైకింగ్, సర్వీస్, డిఫెన్స్ వంటి వాటిలో మెళుకువలు నేర్పుతున్నారు.

ముందుగా ఫిట్‌నెస్‌పై శిక్షణ..

వాలీబాల్ కోర్టులోకి దిగే ముందు విద్యార్థులకు కోచ్‌లు ఫిట్‌నెస్‌పై అవగాహన కలిగిస్తున్నారు. క్రీడల్లో రాణించాలంటే ఫిట్‌నెస్ ఎంతో అవసరమని చెప్తూ వారితో రన్నింగ్, లాంగ్‌జంప్‌తో పాటు వాలీబాల్ క్రీడకు కావాల్సిన వాటిపై దాదాపుగా గంట సేపు శిక్షణ ఇచ్చి అనంతరం క్రీడల్లో పాల్గొనేటట్లు చేస్తున్నారు.

క్రీడతో ఫిట్‌నెస్ పెరిగింది



వేసవి సెలవుల్లో వాలీబాల్ శిక్షణను సద్వినియోగం చేసుకుంటున్నాను. పాఠశాల స్థాయిలో ఆడినప్పటికీ ఇక్కడ కోచ్‌లు ప్రత్యేకంగా ఇస్తున్న శిక్షణ నాకు ఎంతో ఉపయోగపడుతుంది. ఈ సమ్మర్ క్యాంపుతో నాకు ఆటతో పాటు ఫిట్‌నెస్ కూడా పెరిగింది.

– కుడుముల చరణ్, ఇంటర్ విద్యార్థి

వాలీబాల్ క్రీడలో మెళకువలు నేర్చుకున్నా



సమ్మర్ క్యాంపులో నాకు వాలీబాల్ క్రీడల్లో ఎన్నో విషయాలు తెలిశాయి. ఆటలో పాయింట్లు ఎలా రాబట్టాలో మెళకువలను కోచ్‌లు ఈ క్యాంపులో నేర్పించారు. దీంతో పాటుగా ఫిట్‌నెస్ ఎలా పెంచుకోవాలో అవగాహన కూడా వచ్చింది.

– కె.కృష్ణ, పదోతరగతి

విద్యార్థుల క్రీడా ప్రతిభను వెలికితీస్తున్నాం



సమ్మర్ క్యాంపులతో విద్యార్థుల్లో ఉండే క్రీడా ప్రతిభను వెలికితీస్తున్నాం. ఆటపై మక్కువ ఉన్న వారిని ప్రత్యేకంగా ప్రొత్సహిస్తాం. వారికి ఆటల్లో అన్ని మెళుకువలు నేర్పి జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఆడించడమే లక్ష్యంగా శిక్షణను ఇస్తున్నాం. ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి.

– తమ్మిశెట్టి శ్రీనివాసరావు, కోచ్

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నిజాయితీకి మారుపేరు

మఠంపల్లి : మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నీతినిజాయితీలకు మారుపేరని మాజీ ఎంపీపీ ముడావత్ కొండానాయక్, మట్టపల్లి దేవస్థాన పాలకమండలి సభ్యులు కుమ్మరికుంట్ల వెంకటనారాయణ, గుండా కొండల్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పౌరసరఫరాల శాఖలో వందల కోట్ల అవినీతి జరిగిందంటూ బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని నిందారోపణలతో అబాసుపాలు చేయాలనుకోవడం అవివేకమని ధ్వజమెత్తారు. తాము గతంలో ఇతర పార్టీలో క్రియాశీలకంగా ఉండటంమేగాక ప్రజాప్రతినిధులుగా పనిచేశామన్నారు. అప్పటి నుంచే ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నిజాయితీతో చేసే అభివృద్ధి పనుల పట్ల ఆకర్శితులమై ఇటీవలనే కాంగ్రెస్‌లో చేరామన్నారు. కిష్టపట్టె ప్రాంతంలో వందలకోట్ల రూపాయలతో చేపట్టిన ఎత్తిపోతల పథకాలు, రహదారులు, సబ్‌స్టేషన్‌లు, హైలెవల్ వంతెనలు, పునరావాస కేంద్రాల నిర్మాణం మంత్రి హయాంలోనే జరిగాయని, కనీసం ప్రతిపక్షాలు విమర్శించే పరిస్థితి లేకుండా అభివృద్ధి చేసి చూపించాడన్నారు. రాష్ట్రంలోనే ఎలాంటి అవినీతి ఆరోపణలు లేకుండా పాలన చేస్తున్న సీనియర్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని అడ్డగోలుగా విమర్శించడం మానుకోవాలని హితవు పలికారు. వారి వెంట పలువురు మాజీ సర్పంచ్‌లు తదితరులున్నారు.

విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యం


మాట్లాడుతున్న బడుగుల లింగయ్యయాదవ్

సూర్యాపేట : విద్యతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని, పేదరికాన్ని నిర్మూలించవచ్చని మాజీ రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, శ్రీకృష్ణ యాదవ సేవా ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ రామ్మూర్తి యాదవ్ అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఐఎంఏ ఫంక్షన్ హాల్‌లో శ్రీకృష్ణ యాదవ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో 100 మంది విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నిరుపేద, మధ్యతరగతి యాదవ కుటుంబాల విద్యార్థులను బలోపేతం చేయడానికి ప్రతి ఏడాది నగదు ప్రోత్సాహకాలు అందిస్తామన్నారు. యాదవులు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అన్ని రంగాల్లో ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. యాదవ విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా శ్రీకృష్ణ యాదవ సేవా ట్రస్ట్ పని చేస్తుందన్నారు. సూర్యాపేట జిల్లాలో ఎంతోమంది యాదవులకు ఉపయోగపడేలా భవన నిర్మాణం చేస్తున్నామని తెలిపారు. అనంతరం జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ వట్టె జానయ్యయాదవ్, శ్రీకృష్ణ ట్రస్ట్ జనరల్ సెక్రటరీ రేఖ సత్యం యాదవ్, మర్యాద సైదులు యాదవ్, పోలెబోయిన నర్సయ్య యాదవ్, వజ్జె వీరయ్య యాదవ్, జటంగి వెంకటేశ్వర్లు యాదవ్, గొడ్డేటి సైదులు యాదవ్, చలపతిరావు, రాము యాదవ్, వర్రె సుధాకర్ యాదవ్, సుంకరబోయిన వెంకన్న యాదవ్, భిక్షం యాదవ్, వెంకటేశ్వర్లు యాదవ్, నాగరాజు యాదవ్ పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్నను మెజార్టీతో గెలిపించాలి


సమావేశంలో మాట్లాడుతున్న నాగార్జునరెడ్డి

మునగాల : నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నికల్లో ఇండియా కూటమి బలపర్చిన కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలోని సుందరయ్య భవనంలో సుంకర పిచ్చయ్య అధ్యక్షతన నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సోమవారం జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మతతత్వ, మతోన్మాద బీజేపీ పార్టీని, నిరంకుశ బీఆర్ఎస్ పార్టీని ఓడించాలని కోరారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మేదరమెట్ల వెంకటేశ్వరరావు, పార్టీ మండల కార్యదర్శి చందా చంద్రయ్య, జిల్లా కమిటీ సభ్యుడు దేవరం వెంకటరెడ్డి, పార్టీ మండల కార్యదర్శివర్గ సభ్యులు బచ్చలకూరి స్వరాజ్యం, జూలకంటి విజయలక్ష్మి, దేశిరెడ్డి జ్యోతి, స్టాలిన్‌రెడ్డి, మండవ వెంకటాద్రి, మాతంగి గోపయ్య, బొళ్ల కృష్ణారెడ్డి, గోపిరెడ్డి వెంకటరెడ్డి, గురవయ్య, వెంకటకోటమ్మ, ఆరె.రామకృష్ణారెడ్డి, రమేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పందిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సన్మానం


రిటైర్డ్ ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న పందిరి ఫౌండేషన్ సభ్యులు

మునగాల : 25ఏళ్ల పాటు ఉపాధ్యాయ వృత్తిలో అంకితభావంతో పనిచేసి ఎందరో విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దిన రెణబోతు అప్పిరెడ్డి పలువురికి ఆదర్శప్రాయుడని పందిరి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పందిరి నాగిరెడ్డి కొనియాడారు. మండలంలోని ముకుందాపురం గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు రెణబోతు అప్పిరెడ్డి ఇటీవల పదవీ విరమణ చేయడంతో ఆయనను పందిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలో ఘనంగా పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పందిరి నాగిరెడ్డి మాట్లాడారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా కొనసాగుతూ అప్పిరెడ్డి చేసిన సేవలను కొనియాడారు.

ఉత్తమ ఫలితం సాధించిన విద్యార్థినికి అభినందన..

మండలంలోని ముకుందాపురం గ్రామానికి చెందిన రెణబోతు రిషిత పదోతరగతి పరీక్షల్లో 10/10జీపీఏ సాధించడంతో ఆదివారం పందిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో పందిరి ఫౌండేషన్ గౌరవ సలహాదారుడు సేకు శ్రీనివాసరావు, గ్రామ మాజీ సర్పంచ్, ఉపసర్పంచ్ పందిరి కళావతి, పనస నాగేశ్వరరావు, ఫౌండేషన్ కార్యదర్శి ఇమ్మడి సతీష్‌బాబు, సభ్యులు నర్రా శ్రీపాల్‌రెడ్డి, కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జూన్ 9న శ్రీకంఠమహేశ్వరస్వామి పండుగ


హుజూర్‌నగర్ : సమావేశంలో పాల్గొన్న గౌడ కుల పెద్దలు

హుజూర్‌నగర్ : పట్టణంలో గౌడ కుల సంఘం సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో వారి కులదైవం శ్రీకంఠమహేశ్వర స్వామి (కాటమయ్య) పండుగను జూన్ 9న నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. సమావేశంలో కులపెద్దలు బి.చినవెంకటేశ్వర్లు, ఎస్.రామ్మూర్తి, టి.ఉపేందర్, ఐ.ప్రభాకర్, వల్లపుదాస్ కృష్ణ, దొంతగాని శ్రీనివాస్, బి.వెంకటేశ్వర్లు, అమర్, బాబు, సత్యనారాయణ, గురవయ్య, హుస్సేన్, సాయిరాం, తదితరులు పాల్గొన్నారు.

శ్రీకంఠమహేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

అనంతగిరి : మండల పరిధిలోని పాలారంలో శ్రీకంఠమహేశ్వరస్వామి ఉత్సవాల సందర్భంగా కౌండిన్య గౌడ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కెఎల్ఎన్ ప్రసాద్ ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మట్టపల్లి రామకోటయ్య, మొక్క రమేష్‌గౌడ్, రెడ్డిమల్ల ఏడుకొండలు, మహిళలు పాల్గొన్నారు.

సారా తయారీ స్థావరాలపై ఎక్సైజ్ దాడులు


స్వాధీనం చేసుకున్న సారా, బెల్లం, వాహనాలతో ఎక్సైజ్ అధికారులు

హుజూర్‌నగర్ : నియోజకవర్గంలో ఎక్సైజ్ అధికారులు ఆదివారం సారా తయారీ స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 10లీటర్ల సారా, రెండు ద్విచక్రవాహనాలు, 45లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో సీఐ నాగార్జునరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మట్టంపల్లి మండలం కొత్తదొనబండతండా గ్రామానికి చెందిన బానోత్ రంగా, బాణోత్ సోముడు హనుమంతులగూడెం నుంచి కొత్త దొనబండతండాకు రెండు ద్విచక్రవాహనాలపై సారా తరలిస్తుండగా ఎక్సైజ్ అధికారులు తనిఖీలు నిర్వహించి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 10లీటర్ల నాటుసారా, 100కేజీల బెల్లం, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. అదే విధంగా హుజూర్‌నగర్‌లో అక్రమంగా మద్యం అమ్ముతున్న ఓబెల్టు షాపులో 45లీటర్ల మద్యం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ జగన్మోహన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.


హుజూర్‌నగర్ : స్వాధీనం చేసుకున్న మద్యంతో ఎస్ఐ, పోలీసులు

బెల్ట్ దుకాణంలో తనిఖీలు

హుజూర్‌నగర్ : పట్టణంలో ఓ బెల్టు దుకాణంపై ఆదివారం పోలీసులు దాడి చేసి రూ.25వేల మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఎన్‌జీఓకాలనీకి వెళ్లి దారిలో గల కూల్‌డ్రింక్ దుకాణం యజమాని గోవిందరెడ్డి అక్రమంగా బెల్ట్‌దుకాణం నిర్వహిస్తూ మద్యం విక్రయాలు చేస్తున్నాడు. ఈ విషయమై పోలీసులకు సమాచారం అందడంతో బెల్టు దుకాణంపై దాడి చేశారు. ఈ దాడిలో 69బీర్లు, 59 క్వాటర్ బాటిల్స్, 24 (90) ఎంఎల్ బాటిళ్లు స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. గోవిందరెడ్డిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి


మునగాల : పోలింగ్ సామగ్రితో కేంద్రానికి చేరుకున్న ఎన్నికల సిబ్బంది


చిలుకూరులో పోలింగ్ కేంద్రం వద్ద సిబ్బందితో ఆర్డీఓ, తహసీల్దార్

మునగాల : నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నికలు ఆదివారం అధికారులు అన్ని ఏర్పాటు పూర్తి చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించే పోలింగ్‌కు సంబంధించిన సామగ్రిని పోలింగ్ కేంద్రాల్లో భద్రపరిచినట్లు మండల తహసీల్దార్ వలిగొండ ఆంజనేయులు తెలిపారు. మండల వ్యాప్తంగా 2028మంది పట్టభద్రుల ఓటర్లు ఉండగా వారిలో 1402మంది పురుషులు, 626మంది మహిళలు ఉన్నట్లు తహసీల్దార్ వెల్లడించారు. పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సామగ్రిని కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ పరిశీలించారు. ఆయన వెంట మండల ఆర్ఐ రాధారెడ్డి, రామారావు, పోలింగ్ సిబ్బంది ఉన్నారు.

పాలకవీడు : నేడు జరుగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ శ్రీదేవి ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో మండలంలోని ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. మండలంలో మొత్తం 879ఓటర్లు ఉండగా మహిళలు 253, పురుషులు 626మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. దీంతో ఎన్నికల అధికారులు, సిబ్బంది పోలింగ్ సామగ్రితో కేంద్రాలకు చేరుకున్నారు. పోలింగ్ కేంద్రం వద్ద అన్ని వసతులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శి జ్యోతి, పోలీసులు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

చిలుకూరు : నేడు జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ ధ్రువకుమార్ తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. మండల వ్యాప్తంగా 2207ఓటర్లు ఉన్నట్లు తెలిపారు.

జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఒకే చోట నాలుగు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు, పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుదని, ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ సురభి రాంబాబు తెలిపారు. పోలింగ్ కేంద్రాలను కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ పరిశీలించారు. వారి వెంట ఆర్ఐలు మంజుల, సీతయ్య, రెవెన్యూ, పోలింగ్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

నడిగూడెం : నేడు జరిగే నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కేంద్రానికి సంబంధిత ఎన్నికల సిబ్బంది ఆదివారం చేరుకున్నారు. నడిగూడెం మండల వ్యాప్తంగా 1313మంది పట్టభద్రుల ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

గరిడేపల్లి : నేడు జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ బండ కవిత తెలిపారు. మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో ఏర్పాటు పోలింగ్ కేంద్రాన్ని ఆమె ఆదివారం పరిశీలించి మాట్లాడారు. మండల వ్యాప్తంగా 2581మంది ఓటర్లు ఉన్నట్లు, ఇందులో 1786మంది పురుషులు, 795మంది మహిళలు ఉన్నట్లు తెలిపారు. తాడేపల్లిలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మూడు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 15మంది అధికారులు మూడు బూత్‌ల్లో విధులు నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఆమె వెంట ఎస్ఐ ఈట సైదులు, సీనియర్ అసిస్టెంట్ తబ్రేజ్, ఆర్ఐ రాము, శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి సురేష్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

నేరేడుచర్ల : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నికల్లో భాగంగా ఆదివారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కేంద్రాలకు అధికారులు పోలింగ్ సామగ్రిని చేర్చారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాలను మండల ప్రత్యేక అధికారి ఐసీడీఎస్ పీడీ వెంకటరమణ, ఎంపీడీఓ సోమ సుందర్‌రెడ్డి పరిశీలించారు. మండలంలో మొత్తం 2290 మంది పట్టభద్రుల ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

మోతె : మండల కేంద్రంలో సోమవారం నిర్వహించనున్న నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు ఆదివారం సంబంధిత అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ హరిసింగ్, పోలీసులు పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు.


నడిగూడెంలో..


పాలకవీడులో పోలింగ్ కేంద్రానికి చేరుకున్న ఎన్నికల సిబ్బంది


గరిడేపల్లిలోని జెడ్పీ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రానికి చేరుకున్న అధికారులు

నిత్యావసర సరుకుల పంపిణీ


సరుకులు పంపిణీ చేస్తున్న యూత్ సభ్యులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని లక్కవరం గ్రామానికి చెందిన ఇలసాగరపు ఆదినారాయణ నాలుగేళ్లుగా పక్షవాతంతో ఇబ్బందులు పడుతున్నారు. దీంతో గ్రామానికి చెందిన శ్రీలక్ష్మీనర్సింహ యూత్ సభ్యులు బాధిత కుటుంబానికి రెండు నెలలకు సరిపోయే నిత్యావసర సరుకులను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆర్థికంగా వెనుకబడిన ఆదినారాయణ కుటుంబాన్ని భవిష్యత్‌లో సైతం అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు గొట్టెముక్కల నరసింహ, కీత చందరావు, రాము, వెంకటేశ్వర్లు, గోపి, నవీన్, చందు, విజయ్, యాదగిరి తదితరులు ఉన్నారు.

శివాలయంలో గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పూజలు


పూజలు నిర్వహిస్తున్న గిరిజన సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శరత్

మేళ్లచెరువు: మండల కేంద్రంలోని శ్రీఇష్టకామేశ్వరీ సమేత శ్రీస్వయంభు శంభులింగేశ్వరస్వామి దేవాలయాన్ని ఆదివారం రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఏ. శరత్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ అర్చకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి సన్నిధిలో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించిన ప్రిన్సిపల్ సెక్రటరీకి ఆశీర్వచనాలు, తీర్థప్రసాదాలు అందించి ఘనంగా సత్కరించారు. ఆయన వెంట అర్చకులు విష్ణువర్ధన్ శర్మ, ఆలయ మేనేజర్ కొండారెడ్డి, సిబ్బంది ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

హుజూర్‌నగర్ : పట్టణంలోని చైతన్య పాఠశాలలో 2002-03లో పదోతరగతి అభ్యసించిన పూర్వ విద్యార్థులు ఆదివారం పట్టణంలో ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు తమ పాఠశాల జ్ఞాపకాలను, విద్యార్థుల క్రమశిక్షణ, అనుభవాలు, విజయాలను నెమరువేసుకున్నారు. అనంతరం ఆట పాటలతో చిన్ననాటి అనుభవాలను పంచుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల అధినేత మేరెడ్డి దామోదర్‌రెడ్డి, ఉపాధ్యాయులు ప్రతాప్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, రామలింగాచారి, అమీరుద్దీన్, జనార్దన్‌రెడ్డి, తిరుపతయ్య, బాల శీను, సోమయ్య, వెంకన్న, నలమాద శీను, మాధవి, రాజేశ్వరి, పద్మావతి, ప్రమీల, పి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బీసీ 'ఏ'లో చేర్చాలి

నాగారం : ముదిరాజ్‌లను బీసీ-డీ నుంచి బీసీ-ఏలో చేర్చాలని ముదిరాజ్ హక్కుల పోరాట సమితి నాయకుడు బైరబోయిన శ్రీనివాసులు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ముదిరాజ్‌లకు రాజకీయాలలో రిజర్వేషన్ కల్పించాలన్నారు. ముదిరాజ్‌లను బీసీ-డీలో కొనసాగించడంతో అన్యాయానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.